గాజువాక ఓటర్లు 3,23,671

- పురుష ఓటర్లు 1,62,434 మంది
- మహిళా ఓటర్లు 1,61,225 మంది
- ఈఆర్వో లక్ష్మారెడ్డి వెల్లడి



గాజువాక: గాజువాక నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 3,23,671కు చేరింది. వీరిలో పురుష ఓటర్లు 1,62,434 మంది కాగా, మహిళా ఓటర్లు 1,61,225 మంది. మిగిలిన 12మంది ట్రాన్స్‌జెండర్లు. 2024 ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం అధికారులు ఇటీవల విడుదల చేసిన విషయం తెలిసిందే. గతేడాది అక్టోబర్ 27న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై ఫిర్యాదులను ఈ నెల 11 వరకు స్వీకరించిన అనంతరం, వాటిపై సర్వే పూర్తి చేసి తుది జాబితాను విడుదల చేసినట్టు గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. 2019తో పోలిస్తే నియోజకవర్గంలో అదనంగా 14,345 మంది ఓటర్లు పెరిగారు.

ఓటర్ల పెరుగుదల

ముసాయిదాతో పోలిస్తే నియోజకవర్గంలో తాజాగా ఓటర్లు పెరిగారు. అక్టోబర్‌లో విడుదలైన ముసాయిదాలో మొత్తం ఓటర్లు 3,12,809 మంది. ఓటరు జాబితాల ప్రక్షాళన ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో గతేడాది జులై, ఆగస్టు నెలల్లో సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. మరణించినవారు, డబుల్ ఎంట్రీలు, శాశ్వత వలస వెళ్లిన 15,218 మందిని జాబితాల నుంచి తొలగించగా, ఆ తరువాత చేపట్టిన మార్పులు, చేర్పులలో భాగంగా 26,080 మందికి కొత్తగా ఓటు హక్కు కల్పించినట్టు ఈఆర్వో లక్ష్మారెడ్డి తెలిపారు. గత సాధారణ ఎన్నికల సమయానికి నియోజకవర్గంలో 307 పోలింగ్ బూత్‌లు ఉండగా, ప్రతి పోలింగ్ బూత్‌లోను 1500కు మించి ఓట్లు ఉండరాదన్న ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన రేషనలైజేషన్ అనంతరం ఆ సంఖ్య 302కు తగ్గింది.

వయసుల వారీగా ఓటర్లు

వయసు	ఓటర్లు
18-19	6626
20-29	60643
30-39	87040
40-49	73751
50-59	55015
60-69	26890
70-79	11224
80 ఆపైన	2482

ఓటు ఉన్నవారు దరఖాస్తు చేయొద్దు



అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే మా ధ్యేయం. కానీ, చాలామంది ఓటర్లు తమకు ఓటరు కార్డు రాలేదని మళ్లీ మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. కార్డులు త్వరలో వస్తాయి. కార్డు లేకపోయినా ఓటు హక్కు ఉంటుంది. దరఖాస్తు చేసేముందు మీకు ఓటు ఉందో, లేదో సంబంధిత వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలి. ఓటు నమోదును చాలా పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. అందువల్ల అర్హులందరికీ ఓటు హక్కు వస్తుంది.

– డి.లక్ష్మారెడ్డి, ఓటర్ల నమోదు అధికారి, గాజువాక

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లతో విద్యార్థులు, కార్పొరేటర్ గుడివాడ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ గుడివాడ అనూష 110 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల రూపురేఖలను మార్చడంతో పాటు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి వారిని గ్లోబల్ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు అన్ని అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా ఆలోచించలేని విధంగా వారికి ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్. కాంతం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, నంబారు రాజు, గొంతిన సత్యవతి, మహేష్, సుభాషిణి, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు దేముళ్లు, రవిచంద్, నాగేశ్వరరావు, అన్నపూర్ణ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతులకు కృషి

- తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు
- ఎమ్మెల్యే నాగిరెడ్డి



దయాల్‌నగర్ లోవలో పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: కొండవాలు ప్రాంతాలతో ముడిపడి ఉన్న ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 74వ వార్డు పరిధిలో రూ. 16.40 లక్షలతో దయాల్‌నగర్ లోవ, క్వారీ రోడ్డు, సిద్ధేశ్వరంలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులకు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో కలసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని చెప్పారు. గాజువాక నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి నెంబర్ వన్‌గా తయారు చేస్తున్నామన్నారు. వార్డులో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్.వై. నాయడు, బొడ్డు గోవింద్, లోకేష్, సీతారాం, సూర్యనారాచయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యతో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం



మాట్లాడుతున్న విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: విద్యతో సంపూర్ణ వికాసంతో పాటు సృజనాత్మకత పెంపొందుతుందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. అంతర్జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తులను యుక్తి, శక్తి వంతులుగా తీర్చిదిద్దేది విద్య అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ సుందర్‌రామన్, ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న అరుణోదయ కళాసమితి ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందికి చెందిన అరుణోదయ కళాసమితి ప్రతినిధులు విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. గ్రామానికి చెందిన రెడ్డిపల్లి అశోక్ ఆర్థిక సహాయంతో మింది జిల్లా పరిషత్ పాఠశాలలో 15 మంది విద్యార్థులకు రూ.30 వేలు నగదు ప్రోత్సాహకాలతో పాటు పాఠశాలకు 15 కుర్చీలు, ఆయాలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో కళాసమితి ప్రతినిధులు రెడ్డిపల్లి నానాజీ, వర్రి వెంకటరావు, అప్పలరాజు, పాఠశాల హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న హెచ్‌ఎం విజయ ప్రశాంతి తదితరులు

గాజువాక: అమీర్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఆలిండియా చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటీషన్‌లో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. హైస్కూల్ నుంచి ఈ పోటీలకు 54 మంది విద్యార్థులు హాజరు కాగా, ఏడుగురికి బంగారు పతకాలు, మిగిలిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు లభించినట్లు చిత్రలేఖన ఉపాధ్యాయుడు భావనా రుషి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి విద్యార్థులకు పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రితో స్థానిక బీజేపీ నాయకులు

గాజువాక: వికసిత భారత్ సంకల్ప యాత్రలో పాల్గొనేందుకు విశాఖ విచ్చేసిన కేంద్ర విదేశాంగ శాఖ సహాయమంత్రి మురళీధరన్‌ను గాజువాక బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో మంత్రిని విశాఖ విమానాశ్రయంలో కలిసిన నాయకులు ఆయనకు పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు గూటూరు శంకరరావు, లక్కరాజు సోంబాబు, నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

- నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం
- ఈ నెల 29 వరకు నిర్వహణ



గాజువాక జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



ఉక్కునగరం తృష్ణ గ్రౌండ్‌లో హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

గాజువాక: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పోటీలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ నెల 29వ తేదీ వరకు పోటీలు కొనసాగనున్నట్టు నిర్వహణ కమిటీ చైర్మన్ డి.లక్ష్మారెడ్డి తెలిపారు. తొలిరోజు పోటీల్లో భాగంగా గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఉక్కునగరంలోని తృష్ణ గ్రౌండ్స్‌లో వాలీబాల్ పోటీలు జరిగాయి.

సీఎం నిర్ణయం ప్రశంసనీయం: ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఎంతోమంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, కోచ్ చిరంజీవి, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని విజయ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే

పోటీల్లో భాగంగా మొదటి రోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ సెమీ ఫైనల్స్ పోటీలను నిర్వహించారు.

- కబడ్డీలో దిబ్బపాలెం, శ్రామికనగర్–4 సచివాలయాల జట్లు తలపడగా దిబ్బపాలెం జట్టు విజయం సాధించి, ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ జట్టు పాత అయ్యన్నపాలెం జట్టుతో ఫైనల్స్ ఆడనుంది.
- ఖోఖోలో పెదగంట్యాడ–9 సచివాలయం, బీసీ కాలనీ సచివాలయం జట్ల మధ్య జరిగిన పోటీలో పెదగంట్యాడ–9 జట్టు విజయం సాధించింది. ఈ జట్టు ఫైనల్స్‌లో రామ్‌నగర్ సచివాలయం జట్టుతో తలపడనుంది.
- వాలీబాల్ పోటీల్లో దిబ్బపాలెం ఆర్‌హెచ్ కాలనీ, ఎల్వీ నగర్ సచివాలయాల జట్లు తలపడగా, ఎల్వీనగర్ జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. ఈ జట్టు ప్రశాంతినగర్ టీమ్‌తో తలపడనుంది.
- బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీరామ్‌నగర్, అక్కిరెడ్డిపాలెం మధ్య పోటీ జరిగింది. వివరాలను వెల్లడించాల్సి ఉంది. గెలుపొందిన టీమ్‌లు ఈ నెల 27న నిర్వహించనున్న ఫైనల్స్‌లో తలపడతాయని నిర్వాహకులు తెలిపారు.

'ఆ సంఘాలు కార్మికులకు క్షమాపణ చెప్పాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: కార్మిక సమస్యలు పరిష్కరించడం చేతకాకపోతే కార్మికులకు గత, ప్రస్తుత గుర్తింపు సంఘాలు సీఐటీయూ, ఏఐటీయూసీ క్షమాపణ చెప్పాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఎల్‌ఎంఎం పార్కులో బుధవారం జరిగిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏడేళ్లుగా వేతన సవరణ జరగలేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్‌జేసీఎస్ సమావేశంలో ఏఐటీయూసీ యాజమాన్యంపై ఒత్తిడి తేలేకపోయిందని, దీంతో కార్మికుల వేతన సవరణ అయోమయంలో పడిందని అన్నారు. యాజమాన్యం కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు నిలిపివేయడంతో పాటు ఇటీవల వివిధ ఆంక్షలతో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. యాజమాన్యం వైఖరి మార్చుకోకపోతే భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, రమణ, బీఎస్.రాజు, నాయుడు, బీఎంకె నాయక్ పాల్గొన్నారు.

ఎన్‌జేసీఎస్‌లో స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ప్రస్తావనేదీ?

నాన్ జేసీఎం నాయకుల ఆవేదన



కార్యక్రమంలో ఐక్యత చాటుతున్న నాన్ జేసీఎం నాయకులు

ఉక్కునగరం: ఎన్‌జేసీఎస్ చర్చల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై ప్రస్తావనే లేదని స్టీల్‌ప్లాంట్ నాన్ జేసీఎం సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం జరిగిన నాన్ జేసీఎం సమావేశంలో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌జేసీఎస్ కోర్ కమిటీ సభ్యునిగా ఉన్నా చర్చల ఎజెండాలో స్టీల్‌ప్లాంట్ వేతన సవరణ వంటి ముఖ్య అంశం చేర్చకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో స్టీల్‌ప్లాంట్ సమస్యలను చర్చించకపోవడంతో పాటు సమావేశానికి హాజరైన స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులపై ఎటువంటి ఒత్తిడి తేకపోవడం బట్టి నాయకుల తీరు అర్థం అవుతోందన్నారు. కేవలం సెయిల్ కార్మికుల సమస్యల కోసం సమ్మెకు పిలుపు ఇచ్చారు తప్ప విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల కోసం కాదని అర్థం అవుతోందన్నారు. అందువల్లే వారిపై కార్మికులకు విశ్వాసం పోయిందన్నారు. సమావేశంలో వై.మస్తానప్ప (వైఎస్సార్‌టీయూసీ), జి.గణపతిరెడ్డి (హెచ్‌ఎంఎస్), డి.వి.రమణారెడ్డి (డీవీఆర్‌టీయూసీ), కొమ్మినేని శ్రీనివాసరావు (బీఎంఎస్), రామ్‌కుమార్ (వీఎస్‌ఈయూ), మహాలక్ష్మి నాయుడు (వీఎస్‌ఎంఎస్), బి.డేవిడ్ (డీఐటీయూ) తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి శ్రీరామరక్ష

- జగనన్న సురక్ష శిబిరాలతో భరోసా
- వైద్య సేవలపై ప్రజల సంతృప్తి
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- కణితిలో వైద్యశిబిరం ప్రారంభం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



మహిళకు కంటి వైద్యపరీక్ష చేస్తున్న వైద్యురాలు

కూర్మన్నపాలెం: రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శ్రీరామరక్షగా నిలిచిందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీని ప్రారంభిస్తే ఆయన తనయుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని మరింత విస్తృతం చేయడంతో పాటు ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యసేవలను మరింత చేరువ చేశారన్నారు. 86వ వార్డు కూర్మన్నపాలెం సచివాలయ పరిధిలో కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో పేదలు తమకు నచ్చిన నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించడంతో పాటు, ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేసి, పేదలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తోందన్నారు. ప్రస్తుతం జీవనశైలి మార్పులతో దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని, ఇలాంటి తరుణంలో ముందుగానే వ్యాధులను గుర్తించి సరైన వైద్య సహాయం అందిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

324 మందికి వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్పెషల్ ఆఫీసర్ ఉమావతి, డాక్టర్ శివయ్య, డాక్టర్ స్వరూపరాణిలతో పాటు మరో నలుగురు వైద్యులు సేవలు అందించారు. రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు షుగర్, బీపీ, ఆర్థో, గైనిక్, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి నెలకు సరిపడా మందులను అందజేశారు. వైద్య శిబిరంలో సుమారు 324 మంది వైద్య సేవలను పొందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బొడ్డ గోవింద్, దొరబాబు సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రజలు

ఆరోగ్యం కుదుటపడింది



నాకు కాలికి గాయమై, షుగర్ కూడా రావడంతో చాలా ఇబ్బంది పడ్డాను. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చూపించుకునే స్తోమత లేక చాలా బాధ పడ్డాను. జగనన్న సురక్ష శిబిరంలో మెరుగైన వైద్యసేవలు అందడంతో ఆరోగ్యం కుదుటపడింది. శిబిరంలో వైద్య సేవలు చాలా బాగున్నాయి. బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షించి మందులు కూడా ఉచితంగా ఇచ్చారు.

– మాడిన అప్పలనాయుడు, యాదవ జగ్గరాజుపేట

మెరుగైన వైద్యం అందింది



నేను తీవ్రమైన నడుము నొప్పితో బాధ పడుతూ ఉండేదాన్ని. గతంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యం చేయించుకున్నాను. చాలా బాగా చూశారు. ఇప్పుడు మరోసారి పరీక్ష చేయించుకుందామని వచ్చాను. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందించడంతో పాటు మందులు కూడా ఉచితంగా అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–సుందరపల్లి రమణమ్మ, కూర్మన్నపాలెం

ప్రభుత్వ శాఖలు సెస్ బకాయిలు చెల్లించాలి

జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్

మహారాణిపేట: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు కార్మిక శాఖకు చెల్లించాల్సిన సెస్ బకాయిలను ఈ నెలాఖరులోగా చెల్లించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం – వర్కర్స్ చట్టంపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ రహదారులు, భవనాల శాఖ, జీవీఎంసీ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఈపీడీసీఎల్, గంగవరం పోర్టు, ఇతర ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన బకాయి సెస్ ఈ నెల 30లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖాధికారులను ఆదేశించారు. జీవీఎంసీలో 2018 నుంచి ఆన్‌లైన్ ద్వారా సెస్ చెల్లింపులు జరుగుతున్నాయని, అయితే అంతకు ముందు ఆమోదించిన భవన నిర్మాణాల వివరాలను కార్మిక శాఖ ఉప కమిషనర్ కోరగా, 2016 నుంచి 2018 వరకు గల వివరాలను ఈ నెలాఖరులోగా అందజేయాలని ఆదేశించారు. సచివాలయం పోర్టల్ ద్వారా ప్రభుత్వ భవన నిర్మాణాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందని కార్మిక శాఖ ఉప కమిషనర్ జాయింట్ కలెక్టర్‌కు వివరించగా, ఇకపై రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత, సహాయ కమిషనర్ ఎస్.మోహనలక్ష్మి, డీపీవో ఎంవీఏ.శ్రీనివాసరావు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సీహెచ్.గణపతి, సహాయ కార్మిక అధికారులు పీటీవీ లవకుమార్, ఎస్.విజయ శ్రీ,, ఆర్ అండ్ బీ డీఈఈ కె.ఎస్.ఫణీశ్వర్, పాల్గొన్నారు.

రాష్ట్రానికే స్టీల్‌ప్లాంట్ తలమానికం



మాట్లాడుతున్న షర్మిల

కూర్మన్నపాలెం: ఆంధ్ర రాష్ట్రానికే విశాఖ స్టీల్‌ప్లాంట్ తలమానికమని, అటువంటి సంస్థను అమ్మేయాలనుకోవడం దురదృష్టకరమని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు నేటి వరకు న్యాయం జరగలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రధానిగా రాహుల్‌గాంధీ రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ మీద సంతకం చేస్తారని, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతామనే అంశాన్ని చేర్చుతామని తెలిపారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు సంస్థలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎర్నాకుళం – బ్రహ్మపూర్ – ఎర్నాకుళం మధ్య సాధారణ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఎర్నాకుళం – బ్రహ్మపూర్ (06087) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ జనవరి 27, ఫిబ్రవరి 3, 10, 17, 24న (శనివారాల్లో) ఎర్నాకుళంలో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 11.07 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్ – ఎర్నాకుళం (06088) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ జనవరి 29, ఫిబ్రవరి 5, 12, 19, 26న బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.05 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 6.07 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 9.40 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కూర్మన్నపాలెం: పురుగుల మందు తాగిన ఓ వృద్ధుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కాపుజగ్గరాజుపేట ఎస్‌టీబీఎల్ వసంత గార్డెన్స్‌లోని ఓ ఫ్లాట్‌లో ముంగర పాండురంగారావు (70) ఈ నెల 20వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. దీంతో ఆయన కుమారుడు నాగబాబు వెంటనే ఆయన్ను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పాండురంగారావు బుధవారం మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడు నాగబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా గోపాలకృష్ణ గణేష్



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ గోపాలకృష్ణ గణేష్ ఎంపికయ్యారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా విధులు నిర్వహించిన వి.వి.వేణుగోపాలరావు గత ఏడాది పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే ఫైనాన్స్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బుధవారం పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ)ఆధ్వర్యంలో ఈ పోస్టుకు ఇంటర్వ్యూలు జరిగాయి. స్టీల్‌ప్లాంట్ నుంచి గోపాలకృష్ణ గణేష్, బి.సూర్యారావు, హేమంత్ కుమార్ ఝా, చక్క మనోజ్ కుమార్, ఈ.కిరణ్‌లు హాజరయ్యారు. ఇందులో గోపాలకృష్ణ గణేష్‌ను ఎంపిక చేసినట్టు పీఈఎస్‌బీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.